క్లుప్తంగా

పంట మార్పిడితో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్‌: పంట మార్పిడి విధానంతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కడంబా, గన్నారం, ఆరెగూడ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ తప్పకుండా చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్‌ సాగుతో కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శైలేష్‌, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



చండీయాగంలో పాల్గొన్న హరీష్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ 21వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 5గంటలకు దీపారాధన, ప్రత్యేక పూజలు, చండీయాగం, పూర్ణాహుతి, మహాహారతి కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు. చండీయాగంలో బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు పాల్గొన్నారు. సాయంత్రం పడి పూజ, భజన హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని సర్‌సిల్క్‌ కాలనీలో గల కట్ట మైసమ్మ దేవాలయంలో కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం చండీహోమం, సామూహిక కుంకుమపూజ, మహాగౌరి పూజ, యజ్ఞ పూజలు, అమ్మవారి క్షీరాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు కచ్చకాయల అంజయ్య, తొటం శ్రీనివాస్‌, వెంగల నగేశ్‌, సాంబశివరావు, గోపి, మంద రాజయ్యతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మండల సమీక్ష సమావేశం

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి ఉదయం 10గంటల్లోగా హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, అమలవుతున్న తీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్‌
కుమురంభీం : బలగం
కాగజ్‌నగర్‌
వెంకటరమణ : బలగం

- ఆసిఫాబాద్‌అర్బన్‌

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్‌)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్‌

ఆదర్శం.. ఆదివాసీ పల్లెలు!

- ఇంటి పన్నుల చెల్లింపుల్లో ముందంజ
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న ప్రజలు
- గడువు కంటే ముందే 20 జీపీల్లో వందశాతం వసూలు
- ఆదర్శంగా ఏజెన్సీ పల్లెలు



వందశాతం పన్నుల వసూలు పూర్తయిన జోడేఘాట్‌ గ్రామం

కెరమెరి: ఆదివాసీ గ్రామాల్లో అక్షరాస్యత తక్కువ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన లేక ఏళ్లుగా వారు పథకాలను వినియోగించుకోవడంలో వెనుకబడిపోయారు. కానీ కొద్దరోజులుగా ఈ పరిస్థితిలో మార్పు వస్తోంది. ప్రత్యేక జిల్లా, కొత్త పంచాయతీల ఏర్పాటు తర్వాత మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. సంక్షేమ పథకాలను వినియోగించుకోవడంతో పాటు ఆదివాసీలు బాధ్యతగా పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలుస్తున్నారు. మారుమూల గూడేలకు చెందిన వారు కూడా పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు సైతం ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ పన్నుల వసూలుకు కృషి చేస్తున్నారు. గడువు కంటే ముందుగానే కెరమెరి మండలంలో 20 గ్రామ పంచాయతీలు వందశాతం పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచాయి.

83.74 శాతం పూర్తి

2022– 23 ఆర్థిక సంవత్సరం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఏటా పంచాయతీ కార్యదర్శులు మార్చి 31లోగా నిర్దేశించిన మేర పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. ఇలా వసూలు చేసిన నిధులను పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు వినియోగిస్తారు. ప్రధానంగా మల్టీపర్పస్‌ కార్మికుల వేతనాలు, పారిశుధ్య పనుల నిర్వహణ, కార్యాలయాల నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం వినియోగిస్తారు. కెరమెరి మండలంలో మొత్తం రూ.20,89,066 వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 31 పంచాయతీల్లో ఇప్పటివరకు రూ.17,49,462 వసూలు చేశారు. పన్నుల వసూలు 83.74 శాతానికి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి వందశాతం వసూలు పూర్తిచేస్తామని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

20 పంచాయతీల్లో వందశాతం

కెరమెరి మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆగర్‌వాడ, అంతాపూర్‌ భోలాపటార్‌, బాబేఝరి, దేవాపూర్‌, ధనోరా, గోండ్‌గూడ, ఇందాపూర్‌, ఝరి, జోడేఘాట్‌, కెలిబి, కెస్లాగూడ, ఖైరీ, కొథారి, మెట్టపిప్రి, మోడి, నిషాని, పార్ధ, రింగన్‌ఘాట్‌, సావర్‌ఖెడా, తుమ్మగూడ గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలయ్యాయి. పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీలు తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. పంచాయతీ కార్యదర్శులు నిత్యం గ్రామ సభలు నిర్వహించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వారికి వివరించడంలో సఫలీకృతులయ్యారు. చిన్న పంచాయతీల్లో ప్రధాన ఆదాయం పన్నుల చెల్లింపుల ద్వారానే సమకూరుతోంది. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుధ్యం, వీధిదీపాల ఏర్పాటు, విద్యుత్‌ స్తంభాలను సరిచేయడం, హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, వాటికి ట్రీగార్డులు ఏర్పాటు చేయడం వంటి పనులు చేపడుతున్నారు.

నెలాఖరు వరకు వందశాతం



ఇప్పటివరకు కెరమెరి మండలంలో 83.74 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. మార్చి 31 నాటికి వందశాతం వసూలు చేసేందుకు కృషి చేస్తాం. ప్రజల్లో చాలా చైతన్యం వచ్చింది. క్షేత్రస్థాయిలో స్వచ్ఛందంగా ముందుకు వస్తుండటంతో పంచాయతీ కార్యదర్శులకు ఇబ్బందులు ఎదురు కావడం లేదు.

– సుదర్శన్‌, ఎంపీవో

గ్రామాల అభివృద్ధికి కృషి



కెరమెరి మండలాన్ని ఆదర్శ మండలాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులు చేపట్టడంలో సహకరిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– పెందోర్‌ మోతిరాం, ఎంపీపీ

ఐకేపీ వీవోఏల వంటావార్పు



వంటావార్పులో పాల్గొన్న వీవోఏలు

కాగజ్‌నగర్‌రూరల్‌: ఐకేపీ వీవోఏల టోకెన్‌ సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మండల ఐకేపీ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్‌ మాట్లాడుతూ వీవోఏల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు. శనివారం కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. వీవోఏలకు పనిభారాన్ని పెంచుతూ మానసికంగా, శారీరకంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమ్మెకు కాంగ్రెస్‌ నాయకుడు రావి శ్రీనివాస్‌ మద్దతు తెలిపారు. వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి శ్రీనివాస్‌, మండల అధ్యక్ష, కార్యదర్శులు ధనరాజ్‌, అంకయ్య, నాయకులు శ్రీనివాస్‌, పురుషోత్తం, పత్రయ్య, పొన్నగీత, వనిత, సర్దార్‌, కల్యాణి, పెంటయ్య, గణేష్‌, పాల్గొన్నారు.

వీవోఏలను ఉద్యోగులుగా గుర్తించాలి

కౌటాల: ఐకేపీ వీవోఏలను సెర్ప్‌ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్‌ అన్నారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట రెండోరోజు శుక్రవారం టోకెన్‌ సమ్మె కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సమ్మెలో వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు, నాయకులు రవి, భీంరావ్‌, మహేశ్వరి, ప్రతిభ, ఇందు, ఆనంద, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర పాలన గాలికొదిలేసిన పాలకులు'

కాగజ్‌నగర్‌రూరల్‌: తెలంగాణ రాష్ట్ర పాలనను పాలకులు గాలికొదిలేశారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. లిక్కర్‌ స్కాంలో పీకల్లోతు కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవితను రక్షించడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడుతూ లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాల్లో మట్టి కొట్టారని ఆరోపించారు.

సిట్టింగ్‌ జడ్జితో విచారణ చేపట్టాలి

తిర్యాణి: టీఎస్‌పీఎస్‌సీ పేపర్‌ లీకేజీపై సిట్టింగ్‌ జడ్జితో విచారణ చేపట్టాలని ఆదివాసీ యువసేన మండల కో కన్వీనర్‌ మడావి వెంకట్రావు డిమాండ్‌ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే పరీక్షలను రద్దు చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు మడావు భగవంత్‌రావు, జుగ్నక మాణిక్‌రావు తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో పేరెంట్స్‌ మీటింగ్‌

కెరమెరి: కెరమెరి, జైనూర్‌, సిర్పూర్‌(యూ), లింగాపూర్‌ మండలాల్లోని పాఠశాలల్లో నేడు ఉదయం 7.50 గంటలకు పేరెంట్స్‌ మీటింగ్‌ నిర్వహించాలని ఎంఈవో కుడ్మెత సుధాకర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలు, విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

కౌటాల: మండలంలోని గుండాయిపేట గ్రామంలో గల విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్‌ శాఖ ఏఈ రవీందర్‌ శుక్రవారం తెలిపారు. నేడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సీసీరోడ్ల నాణ్యతను పరిశీలించాలని, మన ఊరు –మన బడి పనులు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో ఉన్న పల్లెప్రకృతి వనాలు, సెగ్రిగేషన్‌ షెడ్లు, శ్మశాన వాటికలను పరిశీలించాలని పేర్కొన్నారు. విద్యుత్‌ సౌకర్యం లేని శ్మశాన వాటికలకు సోలార్‌ సౌకర్యం కల్పించాలని తెలిపారు. మండలంలోని సావర్‌కేడా, మోడి, కొఠారి గ్రామ పంచాయతీ ఫ్రంట్‌లైన్‌ వర్కర్లకు ఈనెల 24న సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈజీఎస్‌ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

స్వచ్ఛభారత్‌ మిషన్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రమేశ్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని నందిగూడ గ్రామంలో శుక్రవారం స్వచ్ఛభారత్‌ మిషన్‌పై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి రమేశ్‌ పాల్గొని పరిసరాల పరిశుభ్రత ఎలా నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అనంతరం గ్రామాల్లో స్వచ్ఛభారత్‌ మిషన్‌ కార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలనే విషయంపై శిక్షణ ఇచ్చారు. స్వచ్ఛభారత్‌ మిషన్‌ ప్రోగ్రామర్‌ ఫణి, మండల పంచాయతీ అధికారి శంకర్‌, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అధ్వానంగా పాఠశాల పరిసరాలు



జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌ ఆవరణలో భోజనం చేసిన విస్తరాకులు

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌ పరిసరాలు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు భోజనం చేసిన విస్తరాకులు హెచ్‌ఎం గది పక్కనే పడేయడంతో ఆవరణ అపరిశుభ్రతతో కంపు కొడుతుంది. రాత్రి వేళల్లో పాఠశాల ఆవరణ మందుబాబులకు నిలయంగా మారుతోంది. పాఠశాల తరగతి గదులకు తాళాలు కూడా వేయడం లేదంటే అతిశయోక్తి కాదు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహసీల్దార్‌

పెంచికల్‌పేట్‌: పెంచికల్‌పేట్‌ మండల కేంద్రంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్‌ సరిత శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో మండల కేంద్రానికి వచ్చే ప్రజలకు చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్‌, పోతెపల్లి సర్పంచ్‌ దాసరి చంద్రమౌళి, ఎంపీటీసీ దూగుంట రాజన్న, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, జాగృతి అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్‌ ప్లీజ్‌.. నీటి సదుపాయం కరువు!





కెరమెరి: మండలంలోని రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐదేళ్ల క్రితం 'సర్వశిక్ష' నిధులతో రెండు మరుగుదొడ్లు నిర్మించారు. కాని వాటర్‌ ట్యాంకులు నిర్మించకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. నల్లాలు సైతం బిగించినా ట్యాంకు నిర్మాణం చేపట్టలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

సంబంధిత అధికారి: కుడ్మెత సుధాకర్‌, ఎంఈవో, కెరమెరి
ఫోన్‌ నంబర్‌ : 6303401748

డీఎఫ్‌వోకు ఎమ్మెల్యేల అభినందనలు



ఎమ్మెల్యే కోనప్పకు మొక్క అందజేస్తున్న డీఎఫ్‌వో

కాగజ్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పను జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌ టిబ్రేవాల్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మొక్క బహూకరించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నీరజ్‌కుమార్‌ను ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో విజయ్‌కుమార్‌ ఉన్నారు.



నీరజ్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే

డీఎఫ్‌వోను కలిసిన ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌: ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పోడు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న హరీష్‌బాబు

బెజ్జూర్‌: రక్తహీనతతో బాధపడుతూ మృతిచెందిన గిరిజన విద్యార్థిని లాది వెన్నెల కుటుంబానికి ప్రభుత్వం రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిర్పూర్‌ నియోజకవర్గ బీజేపీ నాయకుడు డాక్టర్‌ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్‌ చేశారు. శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉట్నూర్‌లోని ఏకలవ్య మోడల్‌ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గబ్బాయి గ్రామానికి చెందిన బాలిక ఏలాది వెన్నెల రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో మృతిచెందడం బాధకరమన్నారు. ఐటీడీఏ పీవో బాలిక మృతిపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్‌ చేశారు. ఆయన వెంట వైస్‌ ఎంపీపీ రామయ్య, బీజేపీ ప్రధాన కార్యదర్శి ఉమ్మెర బాలకృష్ణ, ఎలాది నారాయణ, మెరుగు బాపు తదితరులు ఉన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం నాయకులు

రెబ్బెన: టీఎస్‌పీఎస్‌సీ పేపర్‌ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ బీజేవైఎం, ఏబీవీపీ జిల్లా శాఖల పిలుపు మేరకు శుక్రవారం తలపెట్టిన కలెక్టరేట్‌ ముట్టడిని దృష్టిలో పెట్టుకుని మండలంలోని బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్‌, మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్‌లను అదుపులోకి తీసుకున్నారు.

సజావుగా ఇంటర్మీడియెట్‌ పరీక్షలు

కాగజ్‌నగర్‌రూరల్‌: జిల్లాలో ఇంటర్మీడియెట్‌ పరీక్షలు సజావుగా సాగుతున్నాయని జిల్లా అదనపు కలెక్టర్‌ రాజేశం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, బాలభారతి, వివేకానంద, వసుంధర జూనియర్‌ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ సతీష్‌, కౌటాల సీఐ సాధిక్‌ పాషా, తహసీల్దార్‌ మునావర్‌ షరీఫ్‌, డెప్యూటీ తహసీల్దార్‌ రాము నాయక్‌ తనిఖీ చేశారు. మాస్‌ కాపీయింగ్‌ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షకు 399 మంది విద్యార్థులకు గాను 366 మంది విద్యార్థులు హాజరయ్యారు. 33 మంది గైర్హాజరయ్యారని సీఎస్‌ టి.స్వరూప, డీవో సునీత తెలిపారు.

దహెగాం: ఈనెల 15న ప్రారంభమైన ఇంటర్‌ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మొత్తం 135 మంది విద్యార్థులకు 122 మంది పరీక్ష రాయగా, 13 మంది గైర్హాజరైనట్లు సీఎస్‌ అమరేందర్‌ తెలిపారు. సిట్టింగ్‌ స్క్వాడ్‌ మహేష్‌ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

బెజ్జూర్‌: మండల కేంద్రంలోని ఇంటర్మీడియెట్‌ పరీక్ష కేంద్రాన్ని బెజ్జూర్‌ తహసీల్దార్‌ శ్రీపాల్‌ సందర్శించారు. శుక్రవారం పరీక్ష కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మాస్‌ కాపీయింగ్‌ జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ జ్ఞానేశ్వర్‌ను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్‌ పరికరాలు వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పార్ట్‌టైం స్వీపర్లకు రావాల్సిన 9నెలల పెండింగ్‌ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మంజూర్‌ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత 30 సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో స్వీపర్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నామని, తమను ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. తొమ్మిది నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

'అక్రమ వెంచర్లకు వత్తాసు'

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లకు కొంత మంది అధికారులు, ప్రజాప్రతినిధులు వత్తాసు పలుకుతున్నారని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్‌ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇనాం భూముల ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఎల్లారం, బూర్గుడ, అంకుసాపూర్‌, రవిచంద్ర కాలనీ, వాంకిడి, రెబ్బెన, కాగజ్‌నగర్‌, కౌటాలలో విచ్చలవిడిగా వెంచర్లు వెలుస్తున్నాయని ఆరోపించారు. రాజ్‌కుమార్‌, టీకానంద్‌, పురుషోత్తం పాల్గొన్నారు.